# జాతి మనసులు శాఖా భేదాలు

మాదిరెడ్డి సులోచన

జాతీయ క్రీడోత్సవాలు జరుగుతాయని కాలేజీ లకు సెలవులిచ్చారు. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి కదా, త్వరగా గదికి వెళ్ళి చదువు కుందాము అనుకుంటున్నాను. సుధ, లక్ష్మి కూడా వస్తారేమోనని వాళ్ళున్న దగ్గరకు వెళ్ళాను.

"మీ రెన్ని అయినా చెప్పండి రమేష్‌గారూ! సౌత్‌లో విద్యార్థికుల శాతం, క్రీడాకారులశాతం కేరళలోనే వుంది'' గొంతులో మైకు వున్నట్టు ఖంగుమన్నది సుధ గొంతు.

"ఏమండోయ్ సుధగారూ! మహా తెలిసినట్టు మాట్లాడకండి. ఆంధ్ర అంత తీసికట్టు కాదు' మీరంతా పొరుగింటి పుల్లకూర రుచి అను కుంటారు" అన్నాడు శేఖర్.

"పుల్లకూర ఏ ఇంటిదయినా రుచేగాని శేఖర్, క్రీడోత్సవాలు జరుగుతున్నాయికదా, ఫలితాలు వస్తే తెలియదా యెవరు వీరులో యెవరు శూరులో. తమ్ముడు తనవాడయినా తగు ధర్మం చెప్పాలన్నారు" అన్నది లక్ష్మి తనకున్న పరిజ్ఞానాన్ని అంతా మాటల్లోపెడుతూ.

"పక్షపాతంగా మాట్లాడకండి. మన రాష్ట్రంలోకూడా క్రీడాకారులకు కొరతలేదు" అన్నాడు హేమచంద్ర.

"తినబోతూ రుచులెందుకు. కొన్నిరోజులు ఆగితే తెలుస్తుందిగా" అన్నది సుధ పదునుగా.

"ఐసీ! మీరు మాట్లాడరేం మాలతీ!" అందరిమీదుగా చూస్తూ అడిగాడు రమేష్.

"నిజాన్ని అంగీకరించటానికి వెనుకాడ వద్దు" అన్నాను క్లుప్తంగా. సాధారణంగా ఇలాంటి విషయాలు వస్తేనూ తేలిసీ తెలియ నట్టు ఏదో అనేస్తుంది సుధ. అబ్బాయిలు వాది స్తారు. చివరకు నేను కలుగజేసుకుని 'మొద్దూ' తెలియని విషయాలజోలికి పోతావెందుకే అని తిడుతుంటాను. కాని ఈ రోజు సుధ అన్న దాంట్లో నిజంవుంది. కేరళలో విద్యార్థికులు యెక్కువే, క్రీడలపై మక్కువే.

నా మాటకు రమేష్‌కు పౌరుషంలాంటిది వచ్చింది.

"ఏమిటండీ మీరు కూడాను! మనల్ని మనము చిన్నబుచ్చుకుని యెవర్నో పొగడటం బాగుందా?" రమేష్ అరిచాడు.

"అర్థం పర్థం లేకుండా ఏం పొగడటం లేదు. క్రానికల్‌లోని ఆఖరిపేజి యెప్పుడయినా చదివారా?" సుధ అడిగింది. నేను తన మాట అవును అనేసరికి యెక్కడలేని ఉత్సాహం వచ్చింది, సుధకు.

"మేం మగవాళ్ళం కదూ! ఏదో ఉద్యోగం కావాలి. యెప్పుడూ వాంటెడ్ కాలమ్స్ చూస్తాం" విసురుగా అన్నాడు శేఖర్.

"అబ్బబ్బ! ఈ తగువెందుకు, క్రీడోత్సవాలు ముగిస్తే తెలుస్తుంది" అన్నది లక్ష్మి.

"అబ్బాయిలంటే, అందునా ఆంధ్రులంటే అంత చులకనగా వుందా? చూద్దాంకాదు బెట్" అన్నాడు రమేష్ ఉక్రోషంగా.

"బెట్!....యెంతెంత?" అన్నది సుధ.

"ఇంతంత ఇవ్వడానికి మేము లక్షాధికార్లము కాము" అన్నాడు రమేష్.

"ఒరేయ్ బిక్షాధికార్లమా! వెధవన్నరవెధవ. ఆదికకుల్లాంటి ఆడపిల్లల ముందు పరువు తీస్తున్నాడు. యెంతో చెప్పండి మేం రడీ'' కాలర్ సర్దుకున్నాడు శేఖర్.

"వాళ్ళతో పందెంకాచి గెలువటం కష్టంరా. అమ్మా, నాన్నతోపాటు ఉద్యోగంచేసే అన్నలు కూడా డబ్బులిస్తారు'' అన్నాడు రమేష్, అతని చెల్లెల్ని గుర్తుకు తెచ్చుకుని. తండ్రి, తల్లి పెద్దన్న ముగ్గురిస్తారు. తనడిగితే ఇంకమ్ టాక్స్ వాళ్ళకంటే అధ్వాన్నంగా లెక్కలు అడుగుతారు.

"అహా! ఏం సత్యం చెప్పాడమ్మా మొన గాడు. ఇంటికి దీపాలు, వంశోద్ధారకులు, మగ పురుషులు అంటూ అమ్మమ్మలు, బామ్మలతో పాటు, అమ్మాయిలున్న మేనమామలు జేబులు తడుపుతుంటారు'' అన్నది సుధ, తనింట్లో తమ్ముళ్ళకిచ్చే ప్రాముఖ్యం తలచుకుని.

"మాలతీ! నువ్వు ఏదంటే అది? కాడ్‌ బరీసా? ఇంగ్లీష్ సినిమానా?'' హేమచంద్ర అడిగాడు.

"అసలీ పందెం కాయటమే నా కిష్టంలేదు. సుధ అన్నదాంట్లో అతిశయోక్తి లేదు'' అన్నాను.

''అలా సమర్థించకు మరి. పందెం ఓడి పోతే నష్టపోయేది యెవరు? మేం? ఆంధ్రప్రదేశ్ పరువు నిలుపటానికి డబ్బుపోయినా ఫరవాలేదు. వియ్‌డోంట్ కేర్....'' అన్నాడు శేఖర్ కవ్వింపుగా.

"సరే. ఈ సారి ఆంధ్రకు యెక్కువ పాయింట్లు వస్తే మీరు ముగ్గురూ తిన్నన్ని అయిటమ్స్ మీరు కోరిన హోటల్లో ఇప్పిస్తాం'' అన్నాను.

"మాట తప్పొద్దు మాలతమ్మా." అన్నాడు రమేష్.

''పూర్తిగా విను మరి. కేరళా గెలిస్తే మా ముగ్గురికీ, మేం కోరిన హోటల్లో మా కిష్ట మయిన పదార్థాలు మీరు ఇప్పించాలి'' అన్నాను.

''అగ్రీడ్! మీరు మహా కోరితే ఏమిటి? అయిస్‌క్రీమ్ అంతేకదా. మేం డ్రింక్స్ అడిగినా సర్దనవద్దు'' హుషారుగా ఈలవేసాడు హేమ చంద్ర.

"చిన్న సవరణ, మాలతి తినడం అన్నది గాని త్రాగటం అనలేదు" సవరించబోయింది సుధ.

"సుద్దమ్మా! అంత కాపీనం వద్దమ్మా, అరవవాళ్ళు కాఫీని, టీని, సారాయిని తింటారు'' అన్నాడు శేఖర్.

"మీరు అరవవాళ్ళు యెప్పుడయ్యారు?'' లక్ష్మి వెక్కిరింతగా అన్నది.

''లక్ష్మీ! నో ఆర్గ్యుమెంట్స్. పందెం ఖాయం'' అన్నాను.

"మీ ఆడవారి మాటలు నమ్మిందెవరట. అబలలం, అసహాయులం అని తప్పించుకున్నా తప్పించుకుంటారు'' అన్నాడు శేఖర్.

మేం కాచిన పందెం ఓ కాగితంమీద వ్రాసి, అర్ధరం సంతకంచేసి, మా అందరిని యెరిగిన అధ్యాపకులు అవధానిగారి దగ్గర పెట్టాం. అయన చిరునవ్వుతో దాన్ని తీసుకున్నారు.

"వయసు వెల్లువలు!'' అనుకోవటం విని పించింది.

ఆ తరువాత ఆ విషయమే మరిచిపోయాం. చదువు, రికార్డ్ ఇవే గొడవలు.

ఆరోజు యునివర్సిటీలో కెమిస్ట్రీ లాబ్ ముందు కూర్చున్నాను. సుధ పరుగున వచ్చింది.

"లేలే .... లే .... కేరళవాళ్ళే ఎక్కువ పాయింట్లు కొట్టేసారు" అన్నది ఉత్సాహంగా.

"కొట్టెయ్యనీ. ఈ ఎంపరికల్ ఫార్ములాతో చస్తున్నాను'' అన్నాను, తల యెత్తకుండానే.

"అది కాదే మాలమ్మా! మనతో పందెం కాసిన వీరులు చిత్తుగా ఓడిపోయారు. పార్టీ ఇస్తామంటున్నారు'' అన్నది అంచులు మించిన ఆనందంతో.

"మతిమరుపు దద్దమ్మా, లే....లే....'' లక్ష్మి వచ్చింది.

అప్పటిగాని తలయెత్తి చుట్టూ చూచే అవ కాశం దొరికింది. చెట్టుక్రింద నిలబడి చూస్తు న్నారు ముగ్గురు వీరులు.

''అబ్బ పోనివ్వండె. పరీక్షలు అయ్యాక చూచుకుందాము'' అన్నాను.

''అదేంలేదు. అలా వదిలేస్తే అయిందానికీ, కానిదానికి తాటాకులు కడతారు. వెళ్ళి తీరాల్సిందే'' సుధ పట్టుపట్టింది.

లేవక తప్పలేదు. ఇప్పటికే అప్పుడప్పుడు సుధ నామీద విసుర్లు విసురుతుంది.

"నీలా తీయగా మాట్లాడటం రాదమ్మా."

"ఆఁ....మాకు మాటంటే మాటే'' అంటూ లేచాను. అందరం రమేష్‌వంక చూచాం.

"ఏమండోయ్! పార్టీ అంటే భయం అను కున్నారా? పదండి'' అన్నాడు.

"ఏ హోటల్‌కు వెళ్దాం?" సుధ అడిగింది.

"పార్టీ నిర్ణయించింది మాలతే కాబట్టి,

హోటల్ తనే నిర్ణయించాలి" అన్నారు ముగ్గురూ.

"కోటి తాజ్ కెళ్దాం పదండి" అన్నాను.

మావాళ్ళు కొర, కొర చూచారు. అబ్బాయిలు రిలీఫ్‌గా ఫీలయ్యారు.

"మాలమ్మా! నీ పెత్తనము చాలమ్మా. ఏపే పదార్థాలు కావాలో నేను ఆర్డరిస్తాను" అన్నది దర్పంగా సుధ.

"సంవత్సరానికి ఆరునెలలు డయటింగ్ చేసే నువ్వేం ఆర్డరిస్తావే?"

చిటికె వేసింది సుధ.

"ఈ రోజు మూడు రోజులకు సరిపడా తింటానే. అర్థం అయిందా?"

"అయింది....అయింది" అన్నాను.

"అవునే....సుధా! అయిస్‌క్రీమ్ కాస్టలీది అడుగు" లక్ష్మి గుస, గుసగా చెప్పింది. అందరం వెళ్ళి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నాం.

"బేరర్!" ఆగలేనట్టు పిలిచింది.

"ఎస్....ఉప్మా, పూరి, ఊతప్పం, కట్లెట్" దండకం చదివాడు అతను మంచినీళ్ళు మా ముందు పెట్టి.

"మొదట ఆరుప్లేట్లు కట్లెట్టు తీసుకురా" దర్పంగా చెప్పింది మా సుధ.

మొదటి రౌండు వాయించేసాం.

రెండవ రౌండులో మసాలాదోసె కావాలన్నది.

మరో అయిదు నిమిషాల్లో దోసె వచ్చింది. ఈసారి నవ్వుతూ లాగించేసాము.

"గులాబ్‌జామున్ తీసుకురా" అన్నది.

"స్వీట్ తింటే ఆరోగ్యం చెడిపోతుంది" అన్నాడు శేఖర్.

"ఒక్కరోజుకి మరేం పరవాలేదు" గులాబ్ జామున్ వచ్చింది. అది పూర్తి అవుతుండగానే టమేటో బాత్‌కు ఆర్డర్ చేసింది. అంతవరకు జాలీగావున్న అబ్బాయిల మూడ్స్ ఖాళీగా మారాయి. ఒకరిని ఒకరు చూసుకుని, కళ్ళతోనే లెక్కలు, సైగలు ప్రారంభించారు.

"కాఫీయా, టీయా?" రమేష్ ఆర్టిఫిషియల్‌గా నవ్వుతూ అడిగాడు.

"కాఫీకేం తొందర ఆగండి" అన్నది సుధ.

వాళ్ళు ముఖాలు చూసుకుంటూ జేబులు తడుముకుంటున్నారు. ఒకరినొకరు చూచుకుంటున్నారు. నాకు చాలు అందామనిపించింది. కాని మంగలోడి మీసాలకోసం మగువలిద్దరు పోట్లాడారన్నట్టు ధాలెంజీలు పందేం కాయటాలా? తిక్క కుదరనీ అనుకున్నాను. అప్పటికే కడుపు నిండిపోయింది.

"చూడు ఒకొక్కప్లేటు వెనిలా, మరి.... ఆఁ! టుటి ఫ్రూటి అయిస్‌క్రీమ్ తీసుకురా" అన్నది సుధ టమేటో బాత్ జాగ్రత్తగా తింటూ.

"అయిస్‌క్రీమ్ కావాలంటే మీరు తినండి. నాకు గొంతునొప్పి" అన్నాడు శేఖర్ దిగులుగా చూస్తూ.

"జలుబా! తలనొప్పా, గొంతునొప్పా! రెండు ఆస్ప్రో బిళ్ళలు వేసుకోండి" అన్నది సుధ నవ్వుతూ.

"లేదు, నాకు ఇస్నొఫీలియా కంప్లెయింటు" అన్నాడు రమేష్.

"అవునా! నాకు అయిస్‌క్రీమ్ పడటం లేదు ఈ మధ్య" అన్నాడు హేమచంద్ర.

"ఇంట్లో కూరలు, వస్తువులు సరిపడ లేనప్పుడు మా అమ్మకు ఏది సహించదు" అన్నది లక్ష్మి కవ్వింపుగా.

"భలేవారండి. మేం డబ్బుకోసం వెనకాడటంలేదు. జబ్బు వస్తుందనిగాని" అన్నాడు రమేష్.

వాళ్ళ ముగ్గురూ చూస్తుండగా మేం ముగ్గురం అయిస్‌క్రీమ్ తిన్నాం.

"సుధా! ఇంకా ఏమయినా కావాలా ఉప్మా, ఇడ్లీ వదిలేసావేం" అన్నాడు శేఖర్ వెటకారంగా.

"ఉప్మా మాకు స్టేపుల్‌ఫుడ్ అయింది. అది చేతకానిరోజు అయ్యర్ హోటల్ ఇడ్లీ తిని విసుగొచ్చింది. చాక్లెట్ అయిస్‌క్రీమ్ కావాలా" అన్నది.

"నాకొద్దు సుధా!...." అన్నాను.

"ఏమ్మా ఒక్కరోజులో లావయిపోవులే" అన్నది.


CHANDRA

"తంతాను జాగ్రత్త. ఇప్పటికే రెండుసార్లు తిన్నాం అయిస్‌క్రీమ్'' అన్నాను.

"తింటే ఏమయింది? అదేం అరగని పదార్థం కాదే."

"పరవాలేదు సుధా! ఇష్టంలేనివారిని బల వంతం చెయ్యటం దేనికి? నీకు తెప్పిస్తాను" అన్నాడు రమేష్.

ఆఖరుపట్టు అయిపోయాక అందరం రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాము. బేరర్ బిల్లు తెచ్చాడు. నలభై యెనిమిది రూపాయల చిల్లర అయింది.

"నా దగ్గర నాలు రూపాయలుందిరా" సిన్సియర్‌గా డబ్బుతీసి బల్లపై పెట్టాడు శేఖర్.

"నా దగ్గర తొమ్మిది రూపాయలుందిరా" అన్నాడు హేమచంద్ర.

నేను క్రీగంట వారిని గమనిస్తూనే లక్ష్మి చెప్పే కబుర్లు వింటున్నాను. రమేష్ ముఖం వెలవెలబోయింది.

"నా దగ్గర మూడురూపాయలే వుంది" అన్నాడు ఆరిపోయిన గొంతును తడి చేసుకుంటూ.

"వాళ్ళ దగ్గర యెంతుందో అడిగి రేపి చ్చేద్దాం" హేమచంద్ర సలహా యిచ్చాడు. రమేష్‌కి నచ్చలేదు.

"జీవితాంతము హేళన చెయ్యటానికా. వద్దు" అన్నాడు.

"బిల్ పే చెయ్యండి. ఒక్క దగ్గరుంటే నాకు గడుస్తుందా?'' అన్నాడు బేరర్. మరో సారి ప్యాంటుజేబులు తడుముకుంటే డబ్బు లేదుగాని పాతది రమేష్ చెక్‌బుక్కు బయటికి వచ్చింది.

''పదవయ్యా బేరర్! మీ మేనేజర్ దగ్గర కొచ్చి చెక్కిస్తాను" అన్నాడు.

"ఏందయ్యా! తిన్నదిక్కడ బిల్ మేనెజర్ దగ్గర పే చేస్తారా? భలేవారు గనక, నా ఉద్యోగం ఊడాలా. ఊడాలా?'' అన్నాడు కోపంగా.

మా వాళ్ళకు పరిస్థితి అర్థం అయింది.

"మాలా వెళ్దాం పదవే" అన్నది సుధ.

''అవునవును. ఇప్పుడు గొప్పకోసం బిల్ యిచ్చినా ఇస్తుంది" జబ్బుపట్టి లాగినంత పని జేసింది లక్ష్మి.

"ఉండవే. వాళ్ళకు చెబుదాం" అన్నాను.

"నువ్వుండు." సుధ నన్ను వెనక్కు నెట్టి ముందుకు వెళ్ళింది. "థాంక్యూ రమేష్ మాకు కాస్త కోఠీలో పనివుంది వస్తాం" అన్నది. అనుసరించక తప్పలేదు. గది దాటుతూ ఒక్క సారి తిరిగిచూచాను. ముగ్గురూ బేరర్‌తో ఘర్షణ పడుతున్నారు.

"జేబుల్లో యెంత డబ్బుందో తెలియకుండా దర్జాగా యెవరు ఆర్డరివ్వమన్నారండీ!"

"అవునయ్యా! ఇలాంటి తమాషాలు హోటల్లో జరుగటం సినిమాల్లో చూచాంగాని ఇలా యెరగం బాబూ!" అంటున్నాడు మరో బేరర్.

"ముగ్గురి జేబుల్లో కలిసివుండవా, అను కున్నాము లేవయ్యా! ఆ మాత్రం తెలియదా?" శేఖర్ దబాయింపు వినిపించింది.

మేం గడప దాటాం.

"అమ్మయ్య!వాళ్ళు వెళ్ళిపోయారు. డబ్బుల ఏర్పాటు నేను చూస్తాను. మీరిద్దరూ యిక్కడే కూర్చుని వెయిట్ చెయ్యండి" హేమచంద్ర కంఠం మెల్లగా వినిపించింది.

పాపం అనిపించింది. కాని వాళ్ళ ధీమాకు నిజంగా ఒకసారి యిలాంటి శాస్తి జరగాలనిపిం చింది. లేకపోతే ఏమిటో మరోసారి డబ్బు దస్కం చూచుకుని ఏర్పాటు చేసుకోరూ!

ముగ్గురం ఆటో చేసుకుని గదికి వచ్చాము. పిన్నిగారి తమ్ముడిని అవమానించామని కాస్త ముభావంగా వుంటుంది. పరీక్షలు అయ్యేవరకు అదే ముభావంతో వుంటే బావుండును అను కున్నాను. ఎవరిమట్టుకు వాళ్ళం పుస్తకాలు పట్టుకుని కూర్చున్నాం.

"మాలా! నేనలా తెలిసిన వాళ్ళింటికి వెళ్ళి వస్తానే" అని సుధ వెళ్ళిపోయింది.

"మాలా! అది యెందుకు వెళ్ళిందో తెలుసా?" పెద్ద డిటెక్టివ్‌లా అడిగింది లక్ష్మి.

"బాయ్ ఫ్రెండ్‌ను మీట్ అవ్వడానికేమో" అన్నాను.

"ఏముందే ఆ బుర్రలో!"

"చూచుకోలేదుగాని, చెప్పవోయ్!" అన్నాను.

"తిన్నది అరగడానికి నడుస్తుంది తెలుసా?" అన్నది. నవ్వేసాను. మర్నాడు లాబ్ నుండి వస్తుంటే హేమచంద్ర కనిపించాడు. నన్ను చూచి ముఖం చాటుచేసుకోబోయాడు. పిలిచాను.

"నాకు పని వుందండి" అన్నాడు. నాకు నవ్వు వస్తుంది. వచ్చే నవ్వును ఆపుకున్నాను.

"ఇంతకీ నిన్న హోటల్ బిల్ పే చేసారా?"

"చెయ్యకపోతే వాడు వదులుతాడా?" అన్నాడు ముఖం గంటుపెట్టుకుని.

"డబ్బు సరిపోలేదన్నారు. సారీ మేం వుండి యివ్వలేకపోయాం" అన్నాను. అతను తన యెడమచేయి చూపి వెళ్ళిపోయాడు. చాలా సేపటికి అర్థం అయింది వాచి లేదని. పాపం జాలీ మనసులు ఖాళీ జేబులు అనుకున్నాను. □

---

మినీ కథ:

# వాచీ

కృపానందం తిట్టుకున్నాడు. పాడు వాచీ! అందరి టైములూ పదిగంటలయితే తన వాచీ ఎనిమిదిన్నర చూపిస్తోంది. రాత్రి పండుకోబోయే ముందే సరిచేశాడు కృపానందం. అంతే షుమారుగా గంటకి అయిదు నిమిషాలు స్లో నడుస్తోంది.

కృపానందానికి పెళ్ళిలో అయిదు సంవత్సరాలనాడు మామగారు చదివించిన వాచీ అది. చదివించిన మూడో నాటికే వాచీ తప్పుగా తిరుగుతోన్నట్టు రూఢీ అయిపోయింది కృపానందానికి.

రిపేరరు వాచీ చూచి, పెదిమ విరచి, "కేసు కొత్తదండి. మిషను ఈనాటిది కాదు" అన్నాడు.

కృపానందం తన మామగారిమీద గంయ్ మనలేక భార్యమీద కంయ్ మన్నాడు.

భార్య కొత్తలోనే గంయ్ గంయ్ లాడింది. అప్పట్నించీ భార్యతోనూ వాచీతోనూ సరిపెట్టుకుంటూ వస్తున్నాడు కృపానందం.

ఉదయం లేస్తూనే గంటకి అయిదు నిమిషాలు చొప్పున లెక్కగట్టి ఆఫీస్ టయిముకి 25 నిమిషాలు ముందుకి నెట్టాడు.

ఈ వాచీ మూలంగా రోజూ మేనేజర్‌తో చీవాట్లు తినకుండా ఈ పద్ధతినే శాశ్వతంగా అమలుజరపాలనికూడా నిశ్చయించుకున్నాడు. తను రోజూ లేచేమరి!

సరిగ్గా 10 గంటలకి ఆఫీసుకు బయలు దేరాడు. అతనికి తృప్తిగా వుంది. సరిగ్గా పావు గంటలో బస్‌స్టాండుకు, మరో పావుగంటకి ఆఫీసుకి చేరుకోవచ్చును.

అన్నీ సక్రమంగా ముగిసి ఆఫీసుకి చేరాడు. కాని కృపానందానికి చీవాట్లు తప్పలేదు.

అతడి వాచీ 10.30 చూపిస్తోంటే ఆఫీస్ టైం 10.50 లో వుంది. మేనేజర్ చెడతిట్టాడు.

కృపానందం ఏడుపు బిగబెట్టుకుని సీట్లో కూలబడ్డాడు.

"చూడు .... మీ నాన్న యిచ్చిన వాచీ!" అన్నాడు భార్యతో సాయంకాలం ఇంటికి వెళ్ళగానే.

"ఏమయింది? ఉదయం టైము సరిచేశానే! స్పీడుగా పోతోంటే" అన్నది భార్య.

కృపానందం కసిగా చూసి, "నీకు అంత దయ ఈనాడు నా వాచీమీద ఎందుకు పుట్టుకు వచ్చింది?" అన్నాడు.

—ఎం. వి. వి. సత్యనారాయణ